ప్రభుత్వ వ్యతిరేకతే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మహ్మద్ జాకీర్‌పాషా తదితరులు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే తమను గెలిపిస్తాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ జాకీర్‌పాషా 200మంది అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి హన్మంతరెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యువతతో పాటు అనేక వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రత్యేక రాష్ట్రంలో కేవలం కేసీఆర్ కుటుంబమే లబ్ధి పొందిందన్నారు. రాష్ట్రంలో సామాజికాభివృద్ధి, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు.
అనంతరం కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నర్సారెడ్డి భూపతి రెడ్డి, జ్యోత్స్న రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి దేవేందర్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హనుమంత్ రెడ్డి విజయానికి సమష్టిగా కృషి చేయాలని తీర్మానించారు. సమావేశంలో నాయకులు శివ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, ఎరోళ్ల కృష్ణా, సురేందర్ రెడ్డి, యేతి రాజారావు, ఉపేందర్ రెడ్డి, అంజి ముదిరాజ్, రాము గౌడ్, షేక్ ఇబ్రహీం, దశరథ, డప్పు నరేందర్, సుదర్శన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, కావాలి గోపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు



ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఎమ్మెల్యే వివేకానంద్..



మంత్రి కేటీఆర్ తో..



ఎమ్మెల్యే వివేకానంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు..

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద్ జన్మదిన వేడుకలు శనివారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయనతో కేక్ కట్ చేయించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో వేలాది మంది పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



వాకర్స్‌తో ముచ్చటిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీ పార్కులో ఆయన వాకర్స్‌ను కలిసి బీజేపీని బలపరచాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.45వేల రేషన్‌కార్డులు ఇప్పిస్తే, ప్రస్తుత ఎమ్మెల్యే 16వేల కార్డులను తొలగించారని ఎద్దేవా చేశారు. నిజమైన అభివృద్ధిని కాంక్షించే ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజుకు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీకి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని, గత ప్రభుత్వాల హయాంలో లేని అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు పరుస్తున్న ఘనత తమ ప్రభుతానిదేనన్నారు. పలు శుభకార్యాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

అభివృద్ధి పథకాలే మళ్లీ గెలిపిస్తాయి



ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ప్రవీణ్‌చారి తదితరులు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మరోసారి గెలిపిస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్‌గృహకల్పకు చెందిన ప్రవీణ్‌చారి 150 మందితో కలిసి స్థానిక కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని, ప్రతిపక్షాల హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

నిజాంపేట్: త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన బీజేపీ సీనియర్ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డిని శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ ఎం.ఆర్.ఎస్ రాజు, రామచంద్ర నాయక్, పుచ్చలపల్లి అజయ్ కుమార్ రెడ్డి, మైలారం అశోక్, శీలం కృష్ణా రెడ్డి, సుమన్ గుగ్గిలం, సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఇంద్రసేనారెడ్డిని అభినందిస్తున్న నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు

ఘనంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు



బాలాత్రిపుర సుందరిగా గాజులరామారం చిత్తారమ్మ..

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు, బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవార్లను శ్రీ బాలా త్రిపుర సందరిగా అలంకరించారు. ఆలయాల వద్ద కంకుమార్చనలు, అన్నదానాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చిత్తారమ్మ ఆలయంలో..



దుర్గామాత పూజల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి



రంగారెడ్డినగర్‌లో..





ఏపీహెచ్‌బీ కాలనీలో..



వెంకటకృష్ణ..



వేణుగోపాల స్వామి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు..



విజయనగర్ కాలనీలో..

వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో..

ఈవీఎం తరలింపునకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంల తరలింపునకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఈవీఎం గోదాం నుంచి ఐదు నియోజకవర్గాల కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లు తరలింపు కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేసుకోగా, శనివారం పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాములను తెరిచి ర్యాండమైజేషన్ ప్రకారం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల వారిగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించి భద్రపరస్తామన్నారు.

జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీ

పోలీసులు ఎఫ్ఎస్‌టీ బృందాలు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను పరిశీలించి విడుదల చేసేందుకు జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రీవెన్స్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న నగదు విడుదల చేసేందుకు వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్లు జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి(91001 15724), డీటీఓ నర్సింహారావు (77999 34204), జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి పద్మజారాణి (73309 99280) వ్యవహరిస్తున్నారన్నారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే జిల్లా గ్రీవెన్స్ కమిటీ ప్రతినిధులను సంప్రదించాలన్నారు.

నగదు, బంగారం సీజ్‌పై మార్గదర్శకాలను పాటించాలి



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. సీజ్ చేసిన నగదు, బంగారం వివరాలను సంబంధిత వ్యక్తులకు తెలపడంతో పాటు ఎక్కడ అప్పీల్ చేయాల్సి ఉంటుందో పేర్కొంటూ.. రశీదు తప్పనిసరిగా అందజేయాలన్నారు. సీజ్ చేసిన బంగారం, నగదు రూ.10 లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించాలన్నారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలని తెలిపారు. సదరు నగదుపై వచ్చే అప్పీళ్లను సంబంధిత సెల్, ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనలు, ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. అలాగే, ఎన్నికల సమయంలో సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం ఇతర విలువైన అభరణాలపై మీడియాకు సమాచారం అందించాలన్నారు. అలాగే, సంబంధిత వ్యక్తులు చేసిన అప్పీల్.. విడుదల చేసే నగదు వివరాలను కూడా ప్రెస్‌కు అందించాలని, దీనికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదిక రూపంలో నిర్ణీత నమూనాలో సమర్పించాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, రాజకీయ పార్టీల, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం అందించాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌తో ఆయన మాట్లాడారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన ఓటర్ నమోదు, ఓటు సవరణ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సురభి రమేష్‌రావు అన్నారు.18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. ఫారం 6 నింపి ఓటరు నమోదుగా చేసుకోవాలని, ఓటరు కార్డు, మార్పు చేర్పులు ఉంటే ఫారం 8ను ఓటరు కార్డులో సవరణ చేసుకోవాలన్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు రాజ్యాంగపరంగా సంక్రమించిందని ఓటును అమ్ముకుని ప్రజాసామ్యాన్ని అపహాస్యం చేయవద్దన్నారు. దేశ ప్రగతి యువతపైనే ఆధారపడి ఉందన్నారు. సమర్థత కలిగిన నాయకులను ఎన్నుకోవడంలో ఓటు ఒక్కటే వజ్రాయుధమని, ప్రజాసామ్య పరిరక్షణలో మనందరం భాగస్వాములై ఓటు హక్కును వినియోగించుకొని నీతివంతమైన పాలకులను ఎన్నుకోవాలని కోరారు.

వాకర్స్ సమస్యలు పరిష్కరిస్తా

కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని కిందికుంట పార్కు వాకర్ల సమస్యలను పరిష్కరిస్తానని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన పార్కులో వాకర్లతో ముచ్చటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కిందికుంట పార్కులో వాకర్స్ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను నేరుగా పరిశీలించామన్నారు. వాకింగ్ ట్రాక్‌కు గుంతలు పడి వాకింగ్ చేసేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. ట్రాక్‌పై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

- మేడ్చల్ డీసీపీ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో తనిఖీలు
- వాహనాల సోదాలు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ డీసీపీ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల సమీపంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా నాకాబందీ నిర్వహించి వాహనాల తనిఖీలు చేపట్టారు. డీసీపీ శబరీష్ నేతృత్వంలో పేట్ బషీరాబాద్, మేడ్చల్, శామీర్‌పేట్, అల్వాల్ సూరారం, దుండిగల్, జీనోమ్ వ్యాలీ ప్రధాన రహదారులపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి వాహనాలను సోదా చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అధిక మొత్తంలో నగదు, బంగారం ఇతర సామగ్రిని ఎవరైనా తీసుకెళ్తే తప్పనిసరిగా రసీదులు ఉండాలని లేని పక్షంలో సీజ్ చేస్తామని డీసీపీ స్పష్టం చేశారు.



చెక్‌పోస్టుల వద్ద గస్తీని పరిశీలిస్తున్న డీసీపీ శబరీష్



మేడ్చల్ డీసీపీ శబరీష్

ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించండి..

- విలువైన బంగారు వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్లలో ఉంచుకోవాలి, లేని పక్షంలో రహస్య ప్రదేశాలో భద్రపర్చుకోవాలి.
- ఇంటికి సెక్యూరిటీ అలారమ్, మోషన్ సెన్సార్‌ను అమర్చుకోవాలి.
- ఇంటి ప్రధానద్వారానికి సెంట్రల్ లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- కాలనీలో అనుమానాస్పదంగా కొత్తవారు సంచరిస్తే వెంటనే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వండి.
- వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేయండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చక్రాలకు చెయిన్స్‌తో లాక్ చేయండి.
- ఎట్టి పరిస్థితుల్లో నేపాల్‌కు చెందిన వారిని వాచ్‌మెన్‌లుగా పెట్టుకోవద్దు, నమ్మకమైన వారినే వాచ్‌మెన్‌లుగా నియమించుకోవాలి.
- మీ ఇళ్లల్లో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల పుటేజీని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలి.
- ఇళ్లల్లో లేని సమయంలో పేపర్, పాల ప్యాకెట్లు జమ కాకుండా జాగ్రత్త తీసుకోండి.
- మెయిన్ డోర్ లాక్ కనిపించకుండా కర్టెన్‌ను అడ్డుగా ఏర్పాటు చేయండి.
- పక్కింటి వాళ్లను ఎప్పటికప్పుడు మీ ఇంటి పరిసరాలను గమనించి ఎప్పటికప్పుడు వారి నుంచి సమాచారం తెలుసుకోండి.
- అల్మారా, కప్‌బోర్డు తాళాలు కామన్ ఏరియాల్లో కాకుండా రహస్య ప్రదేశాల్లో భద్రపర్చుకోండి.
- సోషల్ మీడియాలో మీరు బయటకు వెళ్లిన ఫొటోలు పోస్ట్ చేయకుండా జాగ్రత్త పడండి.

అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాన్ని మార్చుకుంటున్న దృశ్యం

నిజాంపేట్: బాచుపల్లికి చెందిన వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ వీజేఐఈటీ) కళాశాల శనివారం ఎలక్ట్రానిక్స్ రంగంలో పేరొందిన సినాప్సిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో జరిగిన ఈ ఒప్పందంపై సినాప్సిస్ సంస్థ యూనివర్సిటీ ప్రోగ్రామ్ స్పెషలిస్ట్ డాక్టర్ సంకల్ప్ సింగ్ కుమార్, వీఎన్ఆర్‌వీజేఐఈటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.డి.నాయుడు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో తమ విద్యార్థులు సినాప్సిస్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ కోర్సులు నేర్చుకునే వీలుంటుందని, అదే విధంగా నిర్దేశించిన ప్రమాణాలతో పాఠ్యాంశాలు రూపొందించి నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సినాప్సిస్ సంస్థకు చెందిన ఆలివేలు మంగ నీలకంఠం, బాలకృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.